సాక్షి పల్నాడు

సోమవారం । 19 । ఆగస్టు । 2024



వైభవంగా కల్యాణ మహోత్సవం


వినుకొండ(నూజెండ్ల): శ్రీనివాసనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు.



నిండిన పులిచింతల

అచ్చంపేట: పులిచింతల జలాశయం పూర్తిగా నిండింది. నీటినిల్వ 45.10 టీఎంసీలకు చేరింది. దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు.

మహాశక్తి అలంకారంలో బండ్లమ్మ



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులోని బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారిని మహాశక్తి దేవిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పల్నాడు జిల్లాకు చెందిన భక్తులు ఆదివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి చెన్నాయబోడుకు చెందిన యార్లగడ్డ వెంకటేశ్వరరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, ఏఈఓ ఎన్.రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

కొనసాగుతున్న నీటి విడుదల



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ వద్ద ఆదివారం రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. రెండు క్రస్ట్‌గేట్లు ఎనిమిది అడుగుల మేర ఎత్తి 24,920 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 590.00 అడుగుల వద్ద ఉండగా ఇది 312.0450 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ నుంచి కుడికాలువకు 8,067, ఎడమకాలువకు 6,791, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 29,273, ఎస్‌ఎల్‌బీసీకి 1,800, వరదకాలువకు 600క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 71,451 క్యూసెక్కులు వచ్చి చేరుతుండటంతో అంతే మోతాదులో సాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు.


నగరాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని



నెహ్రూనగర్: నగరాభివృద్ధిపై పూర్తి దృష్టి సారించడంతోపాటు రోడ్ల ప్యాచ్ వర్క్‌లు, శానిటేషన్ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని, కార్పొరేషన్‌పై ఉన్న వ్యయభారం తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు సూచించారు. గుంటూరులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి పెమ్మసానిని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం కలిశారు. నగరంలోని పలు సమస్యలపై ఇరువురు చర్చించారు. రోడ్ల ప్యాచ్ వర్క్‌లు, పారిశుద్ధ్య సమస్యలతోపాటు రెవెన్యూ వసూళ్లకు ఎదురవుతున్న ఇబ్బందులను పెమ్మసానికి కమిషనర్ వివరించారు. కార్పొరేషన్‌పై పడుతున్న రెవెన్యూ భారాన్ని తగ్గించి, జీఎంసీకి రావాల్సిన ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలని కమిషనర్‌కు పెమ్మసాని సూచించారు. నగరాభివృద్ధితో పాటు ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్ వంటి పలు సుందరీకరణ కార్యక్రమాలను కూడా చేపట్టాలని రాబోయే 2 వారాల్లో పక్కా ప్రణాళికలను సిద్ధంగా చేయాలని సూచించారు. కార్పొరేషన్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించాలని పెమ్మసాని సూచించారు.

తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ బదిలీ



తెనాలి: తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ బదిలీ అయ్యారు. ఆయనను పాడేరు సబ్‌కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. పాడేరు ఐటీడీ పీవో బాధ్యతలనూ ఆయనకు అప్పగించినట్టు తెలిసింది. తెనాలి సబ్‌కలెక్టర్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు. 2021 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ప్రఖర్‌జైన్ గతేడాది డిసెంబరులో తెనాలి సబ్‌కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆనెల 21న బాధ్యతలు స్వీకరించారు. తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి 96వ అధికారిగా నియమితులైన ఆయన ఎనిమిది నెలలకే బదిలీ అయ్యారు.

లాహిరి లాహిరి లాహిరిలో..

నిండు కుండను తలపిస్తున్న కృష్ణానదిపై సాగర్ అందాలను తిలకిస్తూ.. లాంచీలో చేసే ప్రయాణం అత్యద్భుతం.. నాగార్జున కొండపై చారిత్రక విశేషాలను తిలకించి, పచ్చని తివాచీ పరిచినట్లుండే కొండపై అనుపు, యాంపీ స్టేడియం శ్రీ రంగనాథస్వామి దేవాలయాలను సందర్శించి, చివరిగా ఎత్తిపోతల జలపాతాన్ని దర్శించడం పర్యాటకులకు మధురానుభూతిని మిగిలిస్తుందనడంలో సందేహం లేదు. నాగార్జున కొండను ఆదివారం భారీగా పర్యాటకులు సందర్శించారు. లాంచీల ద్వారా రూ.93,000 ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

– విజయపురిసౌత్



లాంచీలో కొండకు వెళ్లి వస్తున్న పర్యాటకులు

జెడ్పీ స్థల పరిరక్షణకు చర్యలు

- రెండు ఎకరాల స్థలంలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభం
- పీఆర్ గెస్ట్ హౌస్‌లో పీఐయూ కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు
- జెడ్పీ చైర్‌పర్సన్ అనుమతితో వాచ్‌మెన్ నియామకం కోసం కసరత్తు

సాక్షి ఎఫెక్ట్

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని జిల్లా పరిషత్‌కు చెందిన విలువైన స్థలం ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షణ చర్యలను ఎట్టకేలకు ప్రారంభించారు. ఈ నెల 5న 'జెడ్పీ జాగా .. వేసేయ్ పాగా!' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా పరిషత్ పాలక వర్గం, అధికారులు స్పందించారు. జెడ్పీ స్థలం రెండు ఎకరాల్లో ఉన్న ముళ్లకంప, జంగిల్ క్లియరెన్స్ పనులు ఆదివారం పొక్లెయిన్‌తో చేపట్టారు. అంతేకాక ఈ స్థలంలో గతంలో నిర్మాణం చేపట్టి నిలిచిపోయిన పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌లో విద్యుత్ వైరింగ్, తలుపులు సైతం అపహరించుకుపోవడాన్ని అధికారులు గుర్తించారు. గేట్‌కు అధికారులు వేసిన తాళం పగులగొట్టి ఆ స్థలంలో గేదెలను మేపుతుండటంతో ఇటీవల డీఈ ఈఎస్ శేఖర్‌బాబు గెస్ట్‌హౌస్ పరిశీలనకు వెళ్లగా ఆ సమయంలో ఓ వ్యక్తి గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకోవడాన్ని గుర్తించారు. మరోసారి గేదెలను లోపలికి తీసుకువచ్చినట్లయితే కేసు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. శిథిలావస్థలో ఉన్న పంచాయతీరాజ్ ప్రాజెక్టు ఇన్వెస్టిగేషన్ యూనిట్ (పీఐయూ) ను జెడ్పీ స్థలంలోని అసంపూర్తిగా ఉన్న పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌లోకి మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇకపై స్థలం ఆక్రమణలకు గురికాకుండా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అనుమతితో వాచ్‌మెన్ నియామకం కోసం కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆమె ఆదేశాల మేరకు జిల్లా పరిషత్‌కు విలువైన భూమిని దానమిచ్చిన కట్టమూరి అహోబిల భాస్కరరావు పేరును దాతగా బోర్డు ఏర్పాటు చేయబోతున్నారు. అయితే జిల్లా పరిషత్ స్థలంలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టినప్పటికీ ఆ స్థలంలో ఇటీవల ఏర్పాటు చేసిన వెంకటేశ్వర జనరల్ స్టోర్ దుకాణంపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

స్పష్టమైన హామీ మేరకే ధర్నా విరమించాం

- టీడీపీ నాయకుల అహంకారం వారినే దహించి వేస్తుంది
- సూపర్ సిక్స్ హామీల అమలుపై మాట్లాడకుండా చిరుద్యోగులపై ప్రతాపమా?
- ఇప్పటికైనా చిరుద్యోగులపై వేధింపులు మానుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



ప్రభుత్వ వైద్యశాల వద్ద శ్రీనివాసరెడ్డి కుటుంబానికి ఇచ్చిన హామీలను తప్పక అమలు చేయాలని చీఫ్ మేనేజర్ రమాదేవి, సీఐ రామకృష్ణకు చెబుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: బాధిత కుటుంబానికి స్పష్టమైన హామీలు ఇవ్వటం వల్లే చేయాలనుకునే ధర్నాను విరమించామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ప్రభుత్వ హాస్పిటల్‌కు బయలుదేరుతూ పార్టీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఈ కేసును 174గా నమోదుచేశారని, విచారణ అనంతరం 306కు బదిలీ చేస్తామని పోలీసులు స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. అంతేగాకుండా ఆ కుటుంబంలో డిగ్రీ పూర్తిచేసిన కుమారుడికి ఉద్యోగం, రావాల్సిన బకాయిలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. తాము ఆ కుటుంబానికి న్యాయం చేస్తామనే హామీతో ధర్నా విరమించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి టీడీపీ నాయకులు అహంకారంతో చిరు ఉద్యోగులను ఉద్యోగాలు మానుకోవాలంటూ బెదిరించి తద్వారా వారు ఆత్మహత్యలు చేసుకునేందుకు కారణమవుతున్నారని దుయ్యబట్టారు. జిల్లాలో శ్రీనివాసరెడ్డిది రెండో ఆత్మహత్య అన్నారు. బాధితుడిని గత మూడు నెలల నుంచి జీతం చెల్లించకుండా చస్తే చావు.. లేదా ఉద్యోగం మానేయమంటూ తీవ్ర వేధింపులకు గురిచేశారన్నారు. దీంతో మనస్తాపానికి గురైన అతను గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఇలాంటి వారు ఎంతోమంది ఉండగా శ్రీనివాసరెడ్డి ఉదంతం బయటపడిందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, సొసైటీ ఉద్యోగులు, గుమస్తాలు లాంటి చిరు ఉద్యోగులపై ఇటువంటి వేధింపులు గతంలో ఎప్పుడూ లేవన్నారు.

హత్యలు, వేధింపులు, దాడులకే పరిమితం..

ఇటువంటి రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రజలు ఎప్పుడూ చూడలేదని గోపిరెడ్డి అన్నారు. అధికారం ఉండవచ్చు.. పోవచ్చునని, ఇటువంటి దుర్మార్గమైన ప్రభుత్వాన్ని ఇంతకు ముందు తామెప్పుడూ చూడలేదని ప్రజలు అంటున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై దృష్టిపెట్టని ప్రభుత్వ పెద్దలు వేధింపులు, హత్యలు, దాడులకే పరిమితమయ్యారన్నారు. ఖచ్చితంగా రానున్న రోజుల్లో వీరందరూ అప్రతిష్టపాలు కావటం ఖాయమన్నారు. వారి అహంకారమే వారిని దహించి వేస్తుందన్నారు. వేధింపులకు పాల్పడ్డవారిపై కేసు కొనసాగుతుందన్నారు. అన్నవరం పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాసరావు గతంలో అనేక అవకతవకలకు పాల్పడటంతో గుర్తించి వేరే ప్రాంతానికి బదిలీ చేశారన్నారు. ఆ వ్యక్తి మళ్లీ ఇప్పుడు సీఈఓగా వచ్చి పై అధికారులైన సురేంద్రబాబు, రమాదేవితో కలిసి శ్రీనివాసరెడ్డితో పాటు మరో ఉద్యోగినిని ఉద్యోగాలు మానుకోవాలంటూ కక్షసాధింపులకు పాల్పడుతున్నారన్నారు. వీరిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రొంపిచర్ల మండల నాయకులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

పర్‌ఫెక్ట్ పిచ్



రావినూతల గ్రామంతో పాటు క్రికెట్ స్టేడియం వ్యూ

క్రికెట్ @ రావినూతల

- మారుమూల పల్లెలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియం
- 30 ఏళ్లుగా నిర్విరామంగా పోటీలు
- స్టేడియంలో క్రికెట్ ఆడిన పలువురు భారత జట్టు ఆటగాళ్లు

మేదరమెట్ల: ముప్పై ఏళ్ల కిందటే ఆ పల్లె క్రికెట్‌లో ఓనమాలు దిద్దింది. బుడిబుడి అడుగులతో నడకలు నేర్చింది. ఆ తర్వాత ఏకంగా పరుగులు పెట్టింది. క్రికెట్ కోసం గ్రామంలో ఏకంగా అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మాణమైంది. ఆ పల్లె పేరు రావినూతల. నేడు క్రికెట్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అప్పటి ప్రకాశం జిల్లాలో ఉండి నేడు బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని రావినూతల క్రికెట్ ఆట చరిత్ర ఎందరికో స్ఫూర్తిదాయకం. తొలుత ఆ పల్లెలో ఆడుతూ పాడుతూ తిరిగే కుర్రకారు సరదాగా క్రికెట్ పోటీలు నిర్వహిద్దాం అనుకొని వారిలో వారే రెండు జట్లుగా విడిపోయారు. సరదాగా ప్రారంభించిన పోటీలు ఇంతింతై వటుడింతై అన్నట్లుగా పెరిగాయి. అప్పటి నుంచి ప్రారంభించిన పోటీలు 30 ఏళ్లుగా నిర్విరామంగా కొనసాగుతున్నాయి. నేడు అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ పిచ్‌ని ఏర్పాటు చేసుకొని అదే స్థాయిలో అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీల్ని నిర్వహిస్తున్నారు.

అసోసియేషన్ సభ్యుల ఘనత

రావినూతలలో అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీల్ని నిర్వహించడంలో అసోసియేషన్ సభ్యుల కృషి ఎంతగానో ఉంది. గ్రామానికి చెందిన యువకులు రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆర్‌ఎస్‌సీఏ) ఏర్పాటు చేసుకొన్నారు. అప్పటి నుంచి ఏటా సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కప్ పేరుతో క్రికెట్ పోటీల్ని నిర్వహిస్తున్నారు. తొలుత మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించిన పోటీలు అంతర్ రాష్ట్ర స్థాయికి చేరాయి. జిల్లాలోనే అంతర్ రాష్ట్ర పోటీల్ని నిర్వహించగల సామర్థ్యం ఉన్న ఏకైక గ్రౌండ్‌గా పేరు గాంచింది రావినూతల క్రికెట్ స్టేడియం.

స్టేడియంలో ఆడిన అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు

భారత మాజీ స్పిన్నర్ వెంకటపతిరాజు, వికెట్ కీపర్, ఇండియా క్రికెట్ మాజీ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్, భారత జట్టులో ఆడిన నోయల్ డేవిడ్, వేణుగోపాలరావు వంటి అంతర్జాతీయ క్రీడాకారులు సైతం ఈ గ్రౌండ్‌లో ఆడినవారే కావడం విశేషం.

సినీ తారలతో విజేతలకు బహుమతులు

గ్రామస్తులైన ప్రముఖ సినీ నటుడు యర్రా గిరిబాబు, ఆయన కుమారుడు రఘుబాబు పోటీల నిర్వహణకు ముందే గ్రామానికి వచ్చి ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నారు. ఏటా పోటీలు చివరి రోజు ప్రముఖ సినీతారల్ని ఆహ్వానించి వారి చేతుల మీదుగా బహుమతుల్ని అందిస్తున్నారు.



సుందరంగా కనిపిస్తున్న క్రికెట్ గ్రౌండ్

అంతర్జాతీయ ప్రమాణాలు

2004లో స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలతో టర్ఫ్ పిచ్‌ను ఏర్పాటు చేశారు. దానిపై అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీల్ని నిర్వహిస్తున్నారు. ఆ తరువాత పక్కనే మరో పిచ్‌ను అదే ప్రమాణాలతో ఏర్పాటు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా రెండు పిచ్‌లను ఉపయోగిస్తూ పోటీల్ని నిర్వహిస్తున్నారు.

దాతల సహకారం మరువలేనిది

- గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహించడాన్ని గమనించిన అప్పటి అద్దంకి నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ బాచిన చెంచు గరటయ్య గ్రామస్తుల కోరిక మేరకు ఆరు ఎకరాల పోరంబోకు భూమిని క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ఇప్పించారు.
- గ్రామానికి చెందిన దాతలు ఇచ్చిన విరాళాలతో ప్రహరీని కూడా నిర్మించారు.
- పెవిలియన్ నిర్మాణం కోసం అప్పటి ఎంపీ దగ్గుబాటి రామానాయుడు తన నిధుల నుంచి రూ.10 లక్షలు ఇచ్చారు.
- ఎంపీ పనబాక లక్ష్మి, రాజ్యసభ సభ్యుడు జేడీ శీలం తమ నిధుల నుంచి రూ.9 లక్షలు మంజూరుతో స్టేడియంలో ఆడిటోరియం నిర్మించారు.
- 2008లో అప్పటి జిల్లా కలెక్టర్ కృష్ణబాబు టర్ఫ్ పిచ్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.2 లక్షలు ఇచ్చారు.
- పెవిలియన్ ఏర్పాటుతో పాటు దానిపై మరో అంతస్తును ఏర్పాటు చేయడానికి స్థానిక ఎంపీ శ్రీరాం మాల్యాద్రి తన సొంత నిధుల నుంచి రూ.15 లక్షలు ఇచ్చారు.
- ఏపీఎండీసీ ద్వారా రూ.10.లక్షలు మంజూరు చేశారు.
- మరికొందరు దాతలు సహాయ సహకారాల్ని అందించడంతో నేడు స్టేడియం పెవిలియన్ పూర్తి హంగులతో కనిపిస్తోంది.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు

రావినూతల క్రికెట్ స్టేడియంలోని పిచ్ అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయడం వల్ల ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇటీవల అండర్–19 ఉమ్మడి ప్రకాశం క్రికెట్ జట్టు ఎంపికలు సైతం ఈ స్టేడియంలోనే నిర్వహించారు.

సంక్రాంతి సమయంలో ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహణ

ఏటా ఆర్‌ఎస్‌సీఏ సంఘం సభ్యులు విరాళాలు సేకరించి పోటీల్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు సంక్రాంతి పండుగ సమయంలో గ్రామం కోలాహలంగా మారుతుంది. ప్రత్యేకంగా సంఘం అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు (బాబు) క్రికెట్‌పై ఉన్న మక్కువతో అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. 30 సంవత్సరాలుగా పోటీల్ని నిర్వహిస్తున్నారు.

రాష్ట్రంలోనే గుర్తింపు



గడచిన 30 సంవత్సరాలుగా నిరంతరంగా క్రికెట్ పోటీల్ని నిర్వహిస్తున్నాం. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ఆటగాళ్లు ఇక్కడకు వచ్చి ఆడటంతో గ్రామానికి మంచి గుర్తింపు వచ్చింది.

– యర్రా రఘుబాబు, ప్రముఖ సినీ నటుడు, రావినూతల గ్రామం

గ్రామస్తుల సహకారం మరువలేనిది



పోటీల నిర్వహణకు గ్రామస్తుల సహకారం మరువలేనిది. అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలతో పాటు క్రికెట్ పోటీల్ని కొనసాగిస్తున్నాం. రంజీ మ్యాచ్‌లను నిర్వహించేందుకు కూడా గ్రౌండ్ సిద్ధంగా ఉంది. అంతర్జాతీయ ప్రమాణాలతో పిచ్‌ను ఏర్పాటు చేశాం.

– కారుసాల నాగేశ్వరరావు (బాబు), రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు

మానవత్వానికే మాయని మచ్చ

- కోల్‌కతా ఘటనలో నిందితులను వెంటనే అరెస్టు చేయాలి
- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన రామిరెడ్డి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

నరసరావుపేట: కోల్‌కతా ఆర్‌జీ కార్ హాస్పిటల్‌లో మెడిసిన్ పీజీ విద్యార్థినిపై లైంగిక దాడిచేసి హత్యచేసిన ఘటనలో నేరస్తులను వెంటనే అరెస్టు చేసి ప్రజల్లో ఉన్న భయాందోళనలను తొలగించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి కోరారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఈ సంఘటనను ఖండిస్తూ పలువురు ఉద్యోగులు ప్లకార్డులను ప్రదర్శించారు. ఈసందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ కోల్‌కతా ఘటన మానవత్వానికే మాయని మచ్చ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించి ఈ నేరానికి పాల్పడిన వారిని అరెస్టు చేసి కఠినమైన శిక్ష వేయాలని కోరారు. ఘటన వెనుక అనేకమంది సూత్రధారులు ఉన్నారని, పలు ఘటనల ద్వారా రుజువవుతోందని, అందరికీ శిక్ష పడేలా దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. హెల్త్ డిపార్టుమెంట్‌లో అనేకమంది మహిళలు పనిచేస్తుంటారని, ఇటువంటి చర్యలు మళ్లీ జరగకుండా వారికి రక్షణ కల్పించాలని కోరారు. ఉద్యోగినులకు రాత్రిళ్లు డ్యూటీ వేయకూడదని, 36 గంటలపాటు డ్యూటీ వేయటం అత్యంత దుర్మార్గమని తమ సమావేశం తీర్మానించిందన్నారు. సంఘ సెక్రెటరీ చుక్కా వెంకటేశ్వర్లు, తాలూకా ప్రెసిడెంట్ ఫ్లోరెన్స్, మణికుమార్, ఏఎన్ఎం 2 సర్వీసెస్‌కు చెందిన లింగమ్మ, సంపూర్ణ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల విజేత చీరాల క్లబ్ జట్టు

- ద్వితీయ స్థానంలో నరసరావుపేట
- తృతీయ స్థానంలో గుంటూరు



ద్వితీయ స్థానంలో నిలిచిన నరసరావుపేట జట్టు

చీరాల రూరల్: చీరాల ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో ప్రారంభించిన ఎనిమిది జిల్లాల స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. అన్ని జట్లు గెలుపుకోసం నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. చీరాల ఫుట్‌బాల్ క్లబ్ జట్టు విజేతగా నిలిచి, ప్రథమ బహుమతి రూ. 15,116 కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో పల్నాడు జిల్లా నరసరావుపేట జట్టు నిలిచి రూ. 7,116 సొంతం చేసుకుంది. తృతీయ స్థానంలో గుంటూరు జట్టు నిలిచి రూ. 5,116 అందుకుంది. ఆదివారం సెలవు దినం కావడంతో విద్యార్థులు, యువకులు ఫైనల్ పోటీల్ని చూసేందుకు అధికసంఖ్యలో వచ్చారు. పోటీల్ని గొట్టిపాటి భాగ్యరాజ్ పర్యవేక్షించారు.

పొలం వివాదంలో మహిళ హత్య

- అక్కా చెల్లెళ్ల మధ్యే గొడవే కారణం!
- చెల్లెలి బంధువులే హత్యకు ఒడిగట్టారని అనుమానం



పొలంలో హత్యకు గురైన నల్లమేకల సైదమ్మ

పిడుగురాళ్ల: పొలం వివాదంలో గత కొంతకాలంగా అక్క, చెల్లెళ్ల మధ్య గొడవ జరుగుతున్న నేపథ్యంలో అక్క నల్లమేకల సైదమ్మ(52) పొలంలో ఆదివారం రాత్రి దారుణ హత్యకు గురైంది. సేకరించిన సమాచారం మేరకు.. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామానికి చెందిన మృతురాలు నల్లమేకల సైదమ్మ, ఆమె చెల్లి పేరమ్మకు మధ్య గత కొంతకాలంగా పొలం వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం వివాదంలో ఉన్న పొలంలో మృతురాలు నల్లమేకల సైదమ్మ కుమారుడు శివకొండ, భర్త కాసులు కలిసి మట్టి తీసేందుకు వెళ్లారు. అక్కడ పేరమ్మ కుమారుడు వెంకటేశ్వర్లు పొలంలో మట్టి తీసేందుకు నిరాకరించాడు. దీంతో ఎవరి ఇళ్లకు వారు వెళ్లారు. కాగా నల్లమేకల సైదమ్మ రోజు మాదిరిగానే గేదెలు తోలుకొని మేత కోసం పొలానికి వెళ్లింది. రాత్రి అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో భర్త కాసులు, కుమారుడు శివకొండ కలిసి వెదికారు. పొలంలో సైదమ్మ మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మృతురాలి గొంతుపై పెద్దకర్ర ఒత్తిపట్టి ఉండడంతో ఖచ్చితంగా హత్యేనని బంధువులు ఆరోపిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ వెంకట్రావు హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతురాలి కుమారుడు శివకొండ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


వెంకటేశ్వర్లు మృతదేహం

బొల్లాపల్లి: అప్పుల బాధతో ఓ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని రేమిడిచర్లలో ఆదివారం జరిగింది. సేకరించిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మోటపోతుల వెంకటేశ్వర్లు (65) ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ చూడని సమయంలో పురుగుమందు తాగాడు. ఎంతకీ నిద్ర లేకపోవడంతో కుటుంబసభ్యులు చూడగా.. అక్కడ పురుగుమందు డబ్బా కనిపించింది. వెంటనే స్థానికంగా ఉన్న ప్రైవేటు వైద్యుడి వద్దకు ఆయన్ను తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంకటేశ్వర్లు నాలుగేళ్లుగా తనకున్న నాలుగు ఎకరాలతోపాటు మరో 6 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప, పత్తి వంటి పంటలు సాగు చేస్తున్నాడు. మిరప సాగులో నష్టం వాటిల్లడంతో రూ.15 లక్షలు అప్పులు అయ్యాయి. ఆ బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య సుందరమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు. కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బండ్లమోటు ఎస్‌ఐ ఎ.బాలకృష్ణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యువకుడిపై హత్యాయత్నం


యామర్తి సాగర్

నాదెండ్ల: ఇంట్లో నిద్రిస్తున్న యువకుడిపై ముగ్గురు హత్యాయత్నం చేసిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. చిరుమామిళ్ళ ఎస్సీ కాలనీకి చెందిన యామర్తి సాగర్ కొంతకాలంగా కుటుంబంతో గుంటూరులో ఉంటున్నాడు. రెండు నెలల క్రితం చిరుమామిళ్లకు వచ్చి జాన్‌పీటర్, సాగర్, బాలస్వామిలతో కలిసి తాపీ పనులకు వెళ్తున్నాడు. గుంటూరుకు అప్పుడప్పుడు వెళ్లొచ్చేవాడు. మూడు రోజుల క్రితం అందరూ కలిసి మద్యం తాగే క్రమంలో ఘర్షణ జరిగింది. సాగర్‌పై జాన్‌పీటర్ అనే వ్యక్తి కక్ష పెంచుకున్నాడు. అతడిని చంపాలని తోటివారితో కలిసి పథకం వేశాడు. సాగర్ ఒక్కడే ఇంట్లో నిద్రిస్తుండగా జాన్‌పీటర్, సాగర్, బాలస్వామిలు వచ్చి బీరు సీసా పగలగొట్టి.. దాంతో పొడిచి పరారయ్యారు. తీవ్రగాయాలపాలైన సాగర్‌ను స్థానికులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

21న జిల్లా స్థాయి అథ్లెటిక్ జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో అండర్‌-14, 16 బాలబాలికలు, అండర్‌- 18, 20 యువతీయువకుల జిల్లా స్థాయి అథ్లెట్ల ఎంపిక 21న నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

దేవుడి పేరుతో టీడీపీ నేతల దౌర్జన్యం

- మైనార్టీ కుటుంబానికి చెందిన స్థలంలో ప్రహరీ నిర్మాణం
- సదరు స్థలం విక్రయించాలంటూ బెదిరింపులు
- మంత్రి లోకేష్ న్యాయం చేయాలని బాధితుల ఆందోళన


విలేకరులతో మాట్లాడుతున్న కరీమ్‌ఖాన్


నిర్మిస్తున్న ప్రహరీ

తాడేపల్లిరూరల్: టీడీపీ నాయకులు తమ అధికార బలాన్ని ఉపయోగిస్తున్నారు. మైనార్టీ కుటుంబానికి చెందిన స్థలాన్ని విక్రయించాలంటూ ఒత్తిడి తీసుకువస్తున్నారు. కోర్టులో స్టే ఉన్నప్పటికీ స్థలంలోకి వెళ్లనీయకుండా దేవుడి గుడి పేరుతో అక్కడ ప్రహరీ నిర్మిస్తున్నారు. దీంతో బాధితులు ఆదివారం తమ ఆవేదనను వ్యక్తం చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని గంగానమ్మ గుడి వద్ద విలేకరుల సమావేశంలో బాధితులు కరీమ్‌ఖాన్, మొహబూబ్ ఖాన్ కుటుంబసభ్యులు మాట్లాడుతూ.. తాము నలుగురు అన్నదమ్ములమని, నలుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నట్లు తెలిపారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని గంగానమ్మ గుడి వద్ద తమకున్న స్థలానికి పక్కనే మరో ఐదు సెంట్లు కొనుగోలు చేయగా మొత్తం 25 సెంట్లు స్థలం వచ్చిందన్నారు. ఆ స్థలాన్ని తాడేపల్లి టీడీపీకి చెందిన దొంతిరెడ్డి సాంబిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి వారికి విక్రయించాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని చెప్పారు. నాలుగు రోజుల క్రితం తమ తమ్ముడికి ఫోన్ చేసి, మీ అన్నయ్యతో ఫోన్ చేయించమని చెప్పారన్నారు. సదరు వ్యక్తులకు తాను ఫోన్ చేయగా 'గతంలోలా ఇప్పుడు ఉండదు. ఆ స్థలాన్ని మేము చెప్పిన ధరకు అమ్మాలి. లేదంటే ఇబ్బందులు పడతావు'అంటూ బెదిరింపులకు పాల్పడ్డారని చెప్పారు. రాత్రికి రాత్రి గోడ నిర్మాణ పనులు చేస్తున్నారని, మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కమిషనర్‌ను, తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. కమిషనర్ గోడ నిర్మాణ పనులు నిలిపివేయాలని స్థానిక సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లను పంపించగా.. వారిపై కూడా దౌర్జన్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, టీడీపీ పేరు చెప్పి చేస్తున్న ఈ దౌర్జన్యాన్ని లోకేష్ దృష్టికి తీసుకెళతామన్నారు. గతంలో కార్పొరేషన్ వారు అన్ని కొలతలు వేసి, రోడ్డు నిర్మాణం చేపట్టారని చెప్పారు. ఇప్పుడు రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాణ పనులు చేస్తున్నారని, వారి మాట వినకపోతే ఎంత దూరమైనా వెళతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని గంగానమ్మ గుడి కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. అది పూర్వ కాలం నుంచి గుడి స్థలమేనని కరీమ్‌ఖాన్‌కు, వారి కుటుంబ సభ్యులకు ఇటు దారి లేదన్నారు. రెండవసారి రిజిస్ట్రేషన్ చేయించుకునే సమయంలో సర్వే నంబరు మార్చి ఇటు నుంచి దారి చూపిస్తున్నారని చెప్పారు. స్థలం గుడికే చెందాలన్నారు.

వినుకొండ పోలీసుల వింత వైఖరి

- కూలీలను వేధించిన వ్యాపారిని విడిచిపెట్టిన అధికారులు
- టీడీపీ అండదండలు ఉండటంతో కేసు నమోదుకు నిరాకరణ
- ఎస్పీకి మొర పెట్టుకున్నా ఫలితం లేదని బాధితుల ఆవేదన

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ నియోజకవర్గంలో కూలీలను కలప వ్యాపారి అక్రమంగా నిర్బంధించిన విషయంలో పోలీసుల తీరు తీవ్ర విమర్శలు తావిస్తోంది. కేసు నమోదు చేయకుండా తూతూమంత్రంగా విచారణ చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. వినుకొండ ప్రాంతానికి చెందిన కలప వ్యాపారి మస్తాన్ వలి సుబాబుల్, జామాయిల్ కర్ర కొట్టేందుకు మూడేళ్ల క్రితం ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం నుంచి 25 మందిని పనిలో కుదుర్చుకున్నాడు. అవసరాలకు కొంత డబ్బు ఇచ్చి తనకు రూ.8 లక్షలు బాకీ ఉన్నారంటూ తప్పుడు లెక్కలు చూపాడు. వారికి కనీసం జీతం కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టాడు. కూలీల పిల్లలు అనారోగ్యానికి గురైనా పట్టించుకోలేదు. ఇటీవల ఓ చిన్నారి ఇలా మృతి చెందినా పనులు కొనసాగించాలని ఒత్తిడి చేశాడు. దిక్కుతోచని కూలీలు గత సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు మస్తాన్ వలిని విచారించి, వదిలేశారు.

టీడీపీ నాయకుల అండ

మస్తాన్ వలికి టీడీపీకి చెందిన నాయకుల అండదండలు ఉండటంతోనే కేసు లేకుండా వదిలి పెట్టారని బాధితులు ఆరోపిస్తున్నారు. మస్తాన్ వలి వద్ద ఇకపై పనిచేయాల్సిన అవసరం లేదని, స్వస్థలాలకు వెళ్లవచ్చని చెప్పి కూలీలను పోలీసులు పంపించారు. పెద్ద ఘనకార్యం సాధించినట్లు, కూలీలను వెట్టి నుంచి విముక్తులను చేసినట్లు చూపించి మస్తాన్ వలిని వదిలివేయడంతో పోలీసుల తీరును పలువురు తప్పుబడుతున్నారు. కూలీలు తనకు రూ.8 లక్షలు ఇవ్వాలని పోలీసులకు మస్తాన్ వలి తొలుత చెప్పినప్పటికీ విచారణలో మాత్రం దానికి ఎలాంటి ఆధారాలూ చూపలేకపోయాడు. అయినప్పటికీ వదిలి పెట్టడంతో పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు నిష్పక్షపాతంగా విచారించి, నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాధితులు కోరుతున్నారు.

ఏడాదిలో స్టేడియం పనులు పూర్తి చేస్తాం

ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)


స్టేడియం పనులు పరిశీలిస్తున్న కేశినేని శివనాథ్(చిన్ని)

మంగళగిరి: ఏడాది లోపు క్రికెట్ స్టేడియం నిర్మాణం పూర్తి చేసి మ్యాచ్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) చెప్పారు. ఆదివారం మంగళగిరి నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా స్టేడియం పనులు పూర్తి కాలేదన్నారు. వెంటనే బీసీసీఐను సంప్రదించి, నిధులు విడుదల చేయించి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రోడ్లు, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. నిడమర్రు రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టడంతో పాటు స్టేడియంకు ఉన్న రోడ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

బాపట్ల టౌన్: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టణ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. బాపట్ల పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన బెజ్జం సువర్ణరాజు, పల్నాడు జిల్లా, నూజెండ్ల మండలానికి చెందిన వల్లపు చాణక్య వైజాక్‌లో కలిసి చదువుతున్నారు. వీరికి కాకినాడకు చెందిన సంతోష్ అనే స్నేహితుడు ఉన్నాడు. వీరంతా చెడు వ్యసనాలకు బానిసై అక్రమ మార్గాల్లో డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో కాకినాడలోని స్నేహితుడు సంతోష్ వద్ద 400 గ్రాముల గంజాయిని కొని చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారుచేసుకొని రైలు ద్వారా బెజ్జం సువర్ణరాజు, వల్లపు చాణక్య బాపట్ల చేరుకున్నారు. ఉప్పరపాలెం గేటు సమీపంలో రైలుదిగి మోపెడ్‌పై ప్రయాణిస్తుండగా ముందస్తు సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు దాడి చేశారు. బెజ్జం సువర్ణరాజు, వల్లపు చాణక్యలను అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ ఆర్. అహ్మద్ జాని తెలిపారు.


దశ దినకర్మకు వచ్చిన స్వీపర్ మృతి

చేబ్రోలు: దశ దినకర్మకు వచ్చి ప్రమాదవశాత్తూ అప్పాపురం చానల్‌లో జారిపడి పంచాయతీ స్వీపర్ మరణించిన ఘటన మండలంలోని వడ్లమూడి గ్రామ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వడ్లమూడి గ్రామానికి చెందిన పాలపర్తి రామయ్య మృతి చెందాడు. ఆదివారం కర్మక్రతువుల కార్యక్రమానికి పెదనందిపాడు మండలం నాగులపాడు గ్రామానికి చెందిన పాలపర్తి కృష్ణ (54) వచ్చాడు. బంధువులతో కలిసి అప్పాపురం చానల్‌కు వచ్చాడు. ఉధృతంగా ఉన్న నీటి ప్రవాహంలో స్నానం చేసి, తిరుగు ప్రయాణమయ్యారు. కాలువ కట్టమీద నడుచుకుంటూ వస్తున్న కృష్ణ ప్రమాదవశాత్తూ కాలు జారి చానల్‌లో పడిపోయాడు. బంధువులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సమీపంలో కాలువలోని తూడికాడలో ఇరుక్కుపోయి కృష్ణ మృతదేహం కనిపించింది. దీంతో స్థానిక విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు నాగులపాడు పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తున్నట్లు బంధువులు తెలిపారు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కాలు జారి బావిలో పడి రైతు మృతి

సంతమాగులూరు (అద్దంకి): ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని ఏల్చూరులో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన చల్లా వెంకటరెడ్డి (37) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఆదివారం పొలానికి నీరు పెట్టేందుకు పైపులు అమరుస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందాడు. పక్క పొలంలో పని చేసే మరో రైతు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

వాహనం ఢీకొని యాచకురాలి మృతి



చినగంజాం: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకురాలు మృతి చెందింది. ఎస్‌ఐ రమేష్ వివరాల మేరకు.. చినగంజాం నుంచి చీరాల వెళ్లే జాతీయ రహదారిపై ఎంత్రీ హోటల్‌కు సమీపంలో వృద్ధ యాచకురాలు శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందింది. మోటుపల్లి పరిధిలోని ప్రాంతం కావడంతో వీఆర్వో దానియేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసికొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. ఆమె వివరాలు తెలియక పోవడంతో యాచకురాలిగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు పంపినట్లు తెలిపారు.

భార్యతో గొడవ.. భర్త ఆత్మహత్య

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): భార్యతో గొడవపడి భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన భవానీపురం హెచ్‌బీకాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామచంద్రపురానికి చెందిన గుమ్మడివల్లి శ్రీకాంత్ పటమటలోని హృదయాలయ ఆస్పత్రిలో మత్తు డాక్టర్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం ప్రకాశం జిల్లాకు చెందిన త్రివేణితో వివాహమైంది. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. కొద్దికాలం క్రితం నుంచి భవానీపురం హెచ్‌బీ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో శ్రీకాంత్ వేరే మహిళతో ఫోన్‌లో మాట్లాడటం గమనించిన త్రివేణి భర్తను నిలదీసింది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. భార్యపై శ్రీకాంత్ చేయిచేసుకున్నాడు. జరిగిన విషయాన్ని అత్తమామలకు ఫోన్ ద్వారా త్రివేణి తెలిపింది. తాము వస్తామని, గొడవ పడొద్దని వారు సర్ది చెప్పారు. ఈలోగా త్రివేణి తన భర్తతో ఫోన్‌లో మాట్లాడిన మహిళకు ఫోన్ చేసి ఇంటికి రమ్మని పిలిచింది. ఆ మహిళ ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో భవానీపురంలో శ్రీకాంత్ అద్దెకు ఉంటున్న ఇంటికి వచ్చి.. శ్రీకాంత్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో మరోసారి దంపతులు గొడవపడ్డారు. శ్రీకాంత్ కొట్టడంతో ఆమె పక్కింటికి వెళ్లిపోయింది. అతను ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన కుమారుడికి ఏమైనా తినిపిద్దామని త్రివేణి ఇంటికి వెళ్లి చూడగా తలుపులు వేసి ఉన్నాయి. తలుపులు గట్టిగా నెట్టడంతో గడియ ఊడిపోయింది. ఆమె బెడ్ రూంలోకి వెళ్లి చూడగా శ్రీకాంత్ చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. జరిగిన విషయాన్ని త్రివేణి తన బావ వెంకటేష్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. ఈలోగా అత్తమామలు వచ్చేసరికి శ్రీకాంత్ చనిపోయి ఉన్నాడు. దీనిపై శ్రీకాంత్ తండ్రి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. తమ కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని లక్ష్మీనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలకలూరిపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన జరిగింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సయ్యద్ సుభానీ (54) అడ్డ రోడ్డులోని టైర్ల షాపు నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై అడ్డ రోడ్డు సెంటర్‌లోని జాతీయ రహదారి దాటుతున్నాడు. అప్పుడే ఒంగోలు నుంచి గుంటూరు వెళ్తున్న మినీ ట్రక్కు ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుభానీని స్థానికులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. సుభానీకి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ముప్పాళ్ళ: ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీ కొట్టిన ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద ఆదివారం జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని మాదలకు చెందిన డి.మురళీకృష్ణ, వంశీ, మరో యువకుడు ముప్పాళ్ళ నుంచి మాదలకు బైకుపై వెళుతున్నారు. బొల్లవరం అడ్డరోడ్డు వద్ద సత్తెనపల్లి వైపు నుంచి నరసరావుపేట వెళుతున్న ఆటో ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

మృతుడి కుటుంబానికి సహోద్యోగుల అండ


నూరి పర్వీన్‌కు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న డీఎం నాగేశ్వరరావు తదితరులు

నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందడంతో బాధిత కుటుంబానికి తోటి ఉద్యోగులు ఆదివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఐ.యం.ఎల్. డిపోలో సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన నూర్ బాషా బాజీవలి కంప్యూటర్ డేటాఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేసేవారు. ఈ ఏడాది జూలై 14వ తేదీన విధులు ముగించుకొని ఇంటికి వెళ్తూ గోళ్లపాడు గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో శాఖలోని ఉద్యోగులు, అధికారులు రూ.4.84 లక్షలు సేకరించారు. డీఎం జి. నాగేశ్వరరావు, అసిస్టెంట్ డీఎం స్వర్ణలత చేతుల మీదుగా మృతుడి భార్య నూరి పర్వీన్ కు అందజేశారు. కార్యక్రమంలో అహ్మద్ బాషా, పోకా శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి


సమావేశంలో పాల్గొన్న చినరామిరెడ్డి, ఏఎన్ఎంలు

నరసరావుపేట ఈస్ట్: కొన్ని సంవత్సరాలుగా చాలీచాలని జీతంతో గడుపుతున్న ఏఎన్ఎం–2 ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏఎన్ఎం–2 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివారం ప్రకాష్‌నగర్‌లోని శ్రీతిలక్ మున్సిపల్ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. చినరామిరెడ్డి మాట్లాడుతూ.. ఈ ఉద్యోగులు 2007–10 కాలంలో నియామక ఉత్తర్వులు పొందారని చెప్పారు. తక్కువ వేతనానికి పని చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,420 మంది, జిల్లాలో 42 మంది మాత్రమే ఉన్నారని వివరించారు. సంఘం కన్వీనర్ లింగమ్మ, ఏపీజీఈఏ తాలూకా అధ్యక్షురాలు ఎం.ఫ్లోరెన్స్, కార్యదర్శి చుక్క వెంకటేశ్వర్లు, బండి సంపూర్ణ, మణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశంపై ఆధిక్యంలో గుంటూరు జట్టు


మనోహర్, 116 పరుగులు, గుంటూరు

నరసరావుపేట ఈస్ట్: అంతర్ జిల్లాల అండర్–19 క్రికెట్ పోటీలలో భాగంగా కొనసాగుతున్న గుంటూరు, ప్రకాశం జిల్లాల మధ్య మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో గుంటూరు జట్టు ఆధిక్యంలో నిలిచింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో పోటీలు నిర్వహిస్తున్నారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రకాశం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 275 పరుగులకు ఆలౌట్ అయింది. వికెట్ నష్టానికి 9 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండవ రోజు ఆదివారం ఆట ప్రారంభించిన గుంటూరు జట్టు.. తొలి ఇన్నింగ్స్‌లో 390 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని మనోహర్ 148 బంతుల్లో 116 పరుగులతో సెంచరీ నమోదు చేశాడు. జి.ఆకాష్ 70, రోనే 65 పరుగులతో రాణించారు. ప్రకాశం బౌలర్ ప్రనుదీప్‌కు 3 వికెట్లు లభించాయి. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన ప్రకాశం జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు నష్టపోయి 44 పరుగులు సాధించింది. సోమవారం మూడవ రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

దాడి చేసిన టీడీపీ కార్యకర్తలను అరెస్టు చేయాలి

పీడీఎం నాయకుల డిమాండ్


దాడికి గురైన ఎస్టీ సర్పంచి, ఆమె భర్తతో పీడీఎం నేతలు

నరసరావుపేట: ఎస్టీ సర్పంచి రామావత్ ప్రమీల బాయ్, ఆమె భర్త తేజానాయక్‌లపై దాడి చేసి కులం పేరుతో దూషించిన టీడీపీ కార్యకర్తలను వెంటనే అరెస్ట్ చేయాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించేందుకు వచ్చిన మాచర్ల నియోజకవర్గం కారెంపూడి సర్పంచి, ఆమె భర్తపై ఇలా దాడి చేయడం తగదన్నారు. ఆదివారం స్థానిక ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న తేజానాయక్‌ను పీడీఎం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. జెండా ఆవిష్కరించేందుకు తన భర్తతో కలిసి పంచాయతీ ఆఫీస్ వద్దకు రాగా.. టీడీపీ కార్యకర్తలు గోరంట్ల నాగేశ్వరరావు, తుపాకుల చిన్న రత్తయ్య తదితరులు వారిని అడ్డుకొని కులం పేరుతో దూషించారని ఆరోపించారు. అక్కడే నిలబెట్టి, ఆమె భర్త తేజానాయక్‌పై దాడి చేశారన్నారు. గిరిజనుల కనీస అవసరాలు తీర్చలేని పాలకులు, వారిని కనీసం మనుషులుగా కూడా గుర్తించకపోవటం దారుణమన్నారు. అంటరానితనం ఏ స్థితిలో ఉందో ఈ సంఘటన ద్వారా అర్థం చేసుకోవాలన్నారు. అధికార మదం, కుల అహంకారంతో ఈ దాడి చేశారని మండిపడ్డారు. బాధ్యులను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులకు రక్షణ కల్పించాలన్నారు. జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పులిచింతలకు 55,270 క్యూసెక్కులు విడుదల


నిండుకుండలా నాగార్జునసాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి 5 క్రస్ట్‌గేట్లు, రెండు యూనిట్లు ద్వారా మొత్తం 55,270 క్యూసెక్కుల నీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏడీ ఎస్. జయశంకర్, ఏఈ జయపాల్ ఆదివారం తెలిపారు. టైల్‌పాండ్ ప్రాజెక్టు 4 క్రస్ట్ గేట్లను రెండు మీటర్లు, ఒక క్రస్ట్ గేటు 1.50 మీటర్లు ఎత్తి 46,862 క్యూసెక్కులు, ప్రాజెక్టులోని రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి అనంతరం 8,408 క్యూసెక్కులు కలిపి మొత్తం 55,270 క్యూసెక్కుల నీటిని పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ ప్రాజెక్టు నీటి మట్టం పూర్తి స్థాయి 75.50 మీటర్లకుగాను ఇప్పుడు 75.39 మీటర్లకు నీరు చేరుకుందని వెల్లడించారు. రిజర్వాయర్‌లో గరిష్ఠ స్థాయిలో 7.080 టీఎంసీలకు గాను 7.004 టీఎంసీలు నీరు నిల్వ ఉందన్నారు. నాగార్జునసాగర్ నుంచి ఇక్కడకు మొత్తం 53,746 క్యూసెక్కులు వరద నీరు వస్తోందని చెప్పారు. టీఆర్‌సీ లెవల్ 56.25 మీటర్లకు చేరుకుందన్నారు. నాగార్జునసాగర్ నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు.

పరుగుల వర్షం.. వికెట్ల జోరు

హోరాహోరీగా అనంతపురం, తూర్పు గోదావరి మ్యాచ్

మంగళగిరి: అమరావతి టౌన్‌షిప్‌లోని ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో అండర్ – 19 మెన్ మల్టీ డే ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. తూర్పు గోదావరి, అనంతపురం జట్లు పరుగులు వర్షం కురిపించాయి. రెండవ రోజు ఆదివారం బ్యాటింగ్ చేసిన తూర్పు గోదావరి జట్టు 51.1 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటయ్యింది. అనంతపురం బౌలర్ ఎస్. సాహిల్ 7 వికెట్లతో రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 72.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 336 పరుగులు చేసింది. బ్యాటర్ బి.ప్రశాంత్(124) సెంచరీతో విజృంభించగా, 67 పరుగులతో వెంకట్ లోకేష్ సత్తాచాటాడు. తూర్పు గోదావరి బౌలర్ ఎన్. అనిల్ కుమార్ 6 వికెట్లతో రాణించాడు. అంతకుముందు అనంతపురం మొదటి ఇన్నింగ్స్‌లో 205 పరుగులకు పరిమితమైంది. రెండవ రోజు ఆట ముగిసే సమయానికి అనంతపురం 360 పరుగుల ఆధిక్యంలో ఉంది.

వక్ఫ్ ఆస్తులు హస్తగతం చేసుకునేందుకు కేంద్రం యత్నం

లక్ష్మీపురం: దేశంలో మూడవ అతి పెద్ద సంస్థగా ఉన్న వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం హస్తగతం చేసుకోవాలని చూస్తోందని న్యాయనిపుణులు జహారా అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వక్ఫ్ చట్ట సరవరణను వ్యతిరేస్తూ రాష్ట్ర అధక్షులు సుభాన్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులో ముస్లింయేతర్లను నియమించడం చాలా దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు న్యాయవాది సురేష్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వ పరం చేస్తూ.. జిల్లా కలెక్టరుకు విచక్షణాధికారాలు ఇవ్వడం సరికాదన్నారు. హైకోర్టు న్యాయవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధమైన ఈ చర్యలను తక్షణమే నిలిపి వేయాలన్నారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిస్తీ మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణను వెనుకకు తీసుకోకపోతే రాష్ట్రంలోని లౌకిక శక్తులన్నింటినీ కలుపుకుని ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ముస్లిం అడ్వకేట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మతిన్ మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమాన్ని బీజేపీ ప్రభుత్వం నీరుగార్చాలని చూస్తోందన్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ దీన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో జిల్లా అధ్యక్షులు షేక్.బాషా, సీనియర్ నాయకులు ఎండీ అక్బర్, మెడికల్ రేట్స్ నాయకులు ఎండీ సలీం, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఖాజావలి, మిల్లి కౌన్సిల్ జిల్లా నాయకులు ముష్తి ఆసిఫ్ పాల్గొన్నారు.